క్లుప్తంగా

యూటీఎఫ్ పాకెట్ క్యాలెండర్ల ఆవిష్కరణ


పాకెట్ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంతం

చీపురుపల్లి: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం పాకెట్ క్యాలెండర్‌ను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యూటీఎఫ్ సంఘ నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మీసాల అప్పలనాయుడు, చీపురుపల్లి మండలశాఖ అధ్యక్షుడు నడిపేన బలరాం, గౌరవ అధ్యక్షుడు మామిడి శ్రీనివాసరావు, సహాధ్యక్షుడు వై.వి.రమణ పాల్గొన్నారు.

చలివేంద్రాల ప్రారంభం


నెలివాడలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బొండపల్లి: మండలంలో జాతీయ రహదారి–26కు ఆనుకుని ఉన్న నెలివాడ, అంబటివలస గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు బుధవారం ప్రారంభించారు. ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు చలివేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రజాప్రతినిధులు తెలిపారు. సర్పంచ్‌లు,ఎంపీటీసీలు తాళ్లపూడి కీర్తి, సిరిపురం కనవయ్య, కొమ్మునాగమణి,తాళ్లపూడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, రౌతు చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవం


విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న గ్రంథాలయ నిర్వాహకుడు రమణ, తదితరులు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో నడుపుతున్న ప్రజాగ్రంథాలయం వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యతకను వివరించారు. విద్యార్థులు సెలవుదినాల్లో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని సూచించారు. విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. గ్రంథాలయ నిర్వాహకుడు రెడ్డి రమణ, ఉపాధ్యాయుడు డోల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పద్య,నాటక పోటీల్లో విజేతకు సన్మానం


సత్యనారాయణను సన్మానిస్తున్నపెన్షనర్లు

చీపురుపల్లిరూరల్(గరివిడి): తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో ఈనెల 17న నిర్వహించిన జాతీయస్థాయి పద్య నాటక పోటీల్లో మండలానికి చెందిన హానపు సత్యనారాయణ ఆదికవి నన్నయబట్టు పాత్రను పోషించి పద్యపఠన విభాగంలో విజేతగా నిలిచారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈయన్ని గరివిడి పెన్షనర్ల సంఘ భవనంలో పెన్షనర్లు బుధవారం సన్మానించారు.

వర్షాలకు కూలిన పెంకిటిల్లు


కూలిన పెంకుటిల్లు

గజపతినగరం రూరల్: మండలంలోని బూడిపేట గ్రామంలో సూర్యనారాయణకు చెందిన పెంకుటిళ్లు గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిని బుధవారం కూలిపోయిందని వీఆర్‌ఓ సత్యనారాయణ తెలిపారు. ఆసమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఊరూరా ఉగాది వేడుకలు


బొండపల్లి: బి.రాజేరులో పంచాగం వింటున్న గ్రామస్తులు


కొత్తవలస: పాతసుంకరపాలెంలో యువకులకు స్వీట్లు పంచిపెడుతున్న సిద్ధి వినాయక యువజన సంఘం సభ్యులు


శృంగవరపుకోట: ఎస్.కోటలోని పాండవుల గుడి వద్ద పంచాంగ పఠనం చేస్తున్న భాస్కరశర్మ


గుర్ల: భూపాలపురంలో పంచాంగ శ్రవణంలో జెడ్పీటీసీ అప్పలనాయుడు, రైతులు


వేపాడ: బొద్దాంలో పంచాంగ శ్రవణం


గంట్యాడ: పెదవేమలి పంచాంగ పఠనం చేస్తున్న పురోహితుడు

శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఊరురా బుధవారం వైభవంగా నిర్వహించారు. చాలా గ్రామాల్లో వేకువ జామున రైతులు ఎద్దులకు పూజలు చేసి ఏరువాక కార్యక్రమం ప్రారంభించారు. ప్రజలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గ్రామాల్లోని రామాలయాలు, రచ్చబండల వద్ద అర్చకులు పంచాగ పఠనం చేశారు. శోభకృత్ నామసంవత్సరంలో వర్షాలు, నవనాయక ఫలాలు, ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్య,అవమానాలు, కందాయఫలాలు, సూర్య, చంద్ర గ్రహణాలు, ఏయే పంటలు ఎలా పండుతాయి, తదితర వివరాలను పంచాంగ కర్తలు రైతులకు వివరించారు. పంచాంగ శ్రవణం అనంతరం చిన్నా పెద్ద అంతా కలిసి ఉగాది పచ్చడి ఆరగించారు. శృంగవరపుకోట పట్టణంలోని పాండవులగుడి వద్ద విన్నకోట భాస్కరశర్మ పంచాంగ పఠనం చేశారు. 26వ తేదీ ఏరువాక పండగ చేయాలని, తెల్లారితే సోమవారం రాత్రి 1.50 గంటలకు నిర్వహించాలని చెప్పారు. ఏప్రిల్ 25న గ్రామదేవత దారగంగమ్మకు పసుపు, కుంకుమ ఇవ్వాలని నిర్ణయించారు. గుర్ల మండలంలోని పాలవలసలో ఎంపీపీ పొట్నూరు ప్రమీల, భూపాలపురంలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, కెల్లలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. కెల్లలో యువతి రంగులు చల్లుకొని సందడి చేశారు. కొత్తవలస మండలంలోని పాతసుంకరపాలెం గ్రామంలో సిద్ధివినాయక యుజన సంఘం ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు నిర్వహించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బెహరా హరిబాబు, జమ్మల రవి, సంఘం గౌరవ అధ్యక్షులు లెంక ఈశ్వరరావు,సభ్యులు, పెద్దలు గ్రామస్తులకు ఉగాది పచ్చడి, స్వీట్లు పంచిపెట్టారు.

– శృంగవరపుకోట, బొండపల్లి, గంట్యాడ, గజపతినగరం, వేపాడ, గుర్ల, కొత్తవలస

వైభవంగా తీర్థమహోత్సవాలు


జామి: తానవరంలో పూజలందుకుంటున్న నూకాలమ్మ తల్లి


జామి: ఆంజనేయస్వామి ఆలయంలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

జామి: మండలంలోని తానవరం గ్రామంలో నూకాలమ్మ తల్లి, మండల కేంద్రంలోని దొండపర్తి జంక్షన్ వద్ద ఆంజనేయస్వామి తీర్థమహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. తానవరంలో నూకాలమ్మ అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆంజనేయ స్వామి తీర్థం సందర్భంగా నిర్వాహకులు బాలులకు పరుగు పందాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఎడ్ల పరుగు ప్రదర్శన పోటీలు

వేపాడ: మండలంలో వావిలపాడులో నూకాలమ్మ తల్లి పండగ, ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్కంఠగా సాగింది. విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 24 జతల ఎద్దులు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి ఏడు స్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానుల కు గ్రామపెద్దలు, ఉత్సవకమిటీ సభ్యులు నగదు బహుమతులు అందజేశారు. కె.జె.పురం గ్రామానికి చెందిన కొయిలాడ మోహన్ ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచి రూ.12 వేలు, వల్లంపూడికి చెందిన శానాపతి సత్తిబాబు ఎద్దులు రెండో స్థానంలో నిలిచి రూ.10 వేలు, దేవరాపల్లికి చెందిన వీరాంజనేయ ఎద్లులు మూడో స్థానంలో నిలిచి రూ.8 వేలు నగదు బహుమతులు గెలుచుకున్నాయి.


వేపాడ: వావిలపాడులో ఎడ్ల పరుగు ప్రదర్శన

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


తాగునీటి పథకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రామస్వామి

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి తెలిపారు. పంచాయతీ పరిధిలోని 7వ వార్డులో ఏర్పాటు చేసిన డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ 15 వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.5 లక్షలు వెచ్చించి తాగునీటి పథకం ఏర్పాటు చేశామన్నారు. 15 వీధి కుళాయిల ద్వారా రోజూ తాగునీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొల్లు కృష్ణమూర్తి, వార్డు మెంబర్లు రమణ బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనగంటి చెల్లయ్య పాల్గొన్నారు.

శ్రీరామనవమి వసంత నవరాత్రులు ప్రారంభం


ప్రవచిస్తున్న చాగంటి లింగరాజు

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో శ్రీరామ చారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వసంత నవరాత్రుల ఉత్సవాలు బుధ వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను ట్రస్టు చైర్మన్ డాక్టర్ తెన్నేటి సుబ్బారావు ప్రారంభించారు. బహ్మశ్రీ చాగంటి లింగరాజు రామా యణంలో బాలకాండపై ప్రవచనాలు చెప్పారు. .కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వేదుల సోమేశ్వరరావు,వడ్లమాని రమణమూర్తి,వేదుల శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఆలయ ధర్మకర్త, సిబ్బంది, తదితరుల

శృంగవరపుకోట: ఉగాది సందర్భంగా మండలంలోని సీతారాంపురం గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త మిడతాన చిన్నంనాయుడు ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పరిసర గ్రామాలకు చెందిన 70 మంది మహిళలు పాల్గొని ఆకట్టుకునేలా ముగ్గులు వేశారు. మొదటి రెండుస్థానాల్లో నిలిచిన విజేతలకు రూ. 3 వేలు, రూ.2 వేలు చొప్పున నగదు బహుమతులతో పాటు పోటీల్లో పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులను నిర్వాహకులు అందజేశారు. స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమనీయం భద్రావతి,భావనారుషిల కల్యాణం


కల్యాణ మహోత్సవంలో ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని కృష్ణాపురం గ్రామంలో భద్రావతి, భావనారుషిల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. రెండు రోజులపాటు భద్రావతి, భావనారుషీశ్వరుల ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 11గంటల సమయంలో ఆలయంలో కల్యాణం వేదోక్తంగా జరిపించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. కల్యాణ మహోత్సవానికి ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు, ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


జామి: ఉగాది సందర్భంగా భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వెంకటేశ్వరస్వామి, అన్నంరాజుపేటలోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో అర్చకులు వరప్రసాద్, ఫణిహారం సీతారామాచార్యుల ఆధ్వర్యంలో బుధవారం విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. ఆలయాలను, స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు.


జామి: పూజలందుకుంటున్న భీమసింగి వేంకటేశ్వరస్వామి


జామి: ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా బుధవారం విశేష పూజలు నిర్వహించారు. పూజారి కందాడ హరికృష్ణ ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామి వారికి ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు,లక్ష్మీ దంపతులు పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.


వేపాడ: పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి

వేపాడలో..

వేపాడ: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీకృష్ణాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు చేశారు.వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్, శ్రీకృష్ణాలయంలో గోపాల కృష్ణ యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.స్వామి వార్లను విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు.


దత్తిరాజేరు: తులసీదళాలు, పుష్పాలంకరణలో వేంకటేశ్వరస్వామి


వేపాడ: కృష్ణాలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రైవేటు పాఠశాలల్లో పేదపిల్లలకు 25 శాతం సీట్లు

చీపురుపల్లి/గుర్ల/ మెరకముడిదాం/ జామి: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 25 శాతం సీట్లను పేదపిల్లలకు 1వ తరగతిలో ఉచితంగా కేటాయించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందని గుర్ల రెగ్యులర్, చీపురుపల్లి ఇన్‌చార్జ్ ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, మెరకముడిదాం, జామి ఎంఈఓలు రామారావు, జె.జయశ్రీ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగ పిల్లలకు 5 శాతం సీట్లు, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీ , ఓసీ వర్గాల్లోని పేద పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాల కుటుంబాల వారికి రూ.1,20,000, పట్టణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు రూ.1,44,000 ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. అర్హత కలిగిన పిల్లల వివరాలను తల్లిదండ్రులు ఈనెల 23 నుంచి ఏప్రిల్ 7 లోగా సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

త్వరలో అందుబాటులోకి బ్లడ్ బ్యాంక్

- చురుగ్గా బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణ పనులు
- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు చొరవతో రూ.60 లక్షలు కేటాయించిన అరబిందో ఫార్మా


దాదాపు పూర్తి కావొచ్చిన బ్లడ్ బ్యాంక్ భవన నిర్మాణం

చీపురుపల్లి: రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపద సమయాల్లో రక్తం అవసరమైన వారికి అందించేందుకు చీపురుపల్లి పట్టణంతో పాటు నియోజక వర్గంలో ఎక్కడా బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రాలకు పరుగులు తీసి రక్తం తీసుకొచ్చేందుకు ప్రయాసలు పడాల్సి వస్తోంది. నియోజకవర్గ ప్రజలు అత్యవసర సమయంలో రక్తం కోసం ఇబ్బందిపడకుండా, రక్తం కొరత రానివ్వకుండా చేయాలని చీపురుపల్లిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు జిల్లా పరిషత్ మజ్జి శ్రీనివాసరావు చర్యలు చేపట్టారు. బ్లడ్ బ్యాంక్‌కు భవనాలు, ఆధునిక రిఫ్రిజిరేటర్లు, ఇతర సౌకర్యాలు ఉండాలి. వీటి కోసం కనీసం రూ.60 లక్షల వరకు ఖర్చువుతుందని అంచనా వేశారు. బ్లడ్ బ్యాంక్ ఏర్పాటుకు అవసరమైన రూ.60 లక్షలు ఇవ్వాలని అరబిందో ఫార్మా ఫౌండేషన్ యాజమాన్యాన్ని జెడ్పీ చైర్మన్ కోరారు. తక్షణమే స్పందించిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ సీఎస్ఆర్‌లో భాగంగా నిధులు మంజూరు చేసింది. ఆనిధులతో పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ) ఆవరణలో బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన భవనాన్ని నిర్మిస్తున్నారు. భవన నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. త్వరలో ఈ బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి రానుంది. బ్లడ్ బ్యాంక్ నిర్వహణను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ(ఐఆర్‌సీఎస్)కు అప్పగించారు. ఐఆర్‌సీఎస్ నేతృత్వంలో సిబ్బంది రక్త నిల్వలు, పంపిణీ తదితర కార్యకలాపాలు చూసుకుంటారు. చీపురుపల్లి సీహెచ్‌సీని నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని లావేరు, జి.సిగడాం మండలాల ప్రజలు సైతం వైద్యం కోసం ఆశ్రయిస్తుంటారు. ఇక్కడ నెలకు కనీసం వంద వరకు ప్రసవాలు జరుగుతుండగా, రోడ్డు ప్రమాదాల క్షతగాత్రుల సంఖ్య కూడా అధికంగానే ఉంటుంది. ఇక్కడ బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి వస్తే రక్తం కోసం అత్యవసర సమయాల్లో విజయనగరం, విశాఖపట్నం పరుగులు తీయాల్సిన పని ఉండదు.

రహదారి పునరుద్ధరణకు రూ.70 లక్షల మంజూరు


శిథిలమైన పి.లింగాలవలస- వీరసాగరం రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని పి.లింగాలవలస– వీరసాగరం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. అధ్వానంగా తయారైన ఈ బీటీరోడ్డును పునరుద్ధరించాలని, లేదా కనీసం గోతులైనా పూడ్చాలని గత ప్రభుత్వంలో పాలకులను ఆ రోడ్డు పరిధిలోని గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరినా పట్టించుకోలేదు. గత నెలలో గృహసారథులు సమావేశానికి పి.లింగాలవలస వచ్చిన ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్యకు గ్రామస్తులు సమస్యను వివరించారు. రోడ్డు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి రోడ్డు మంజూరు కృషి చేశారు. తాజాగా ఉగాదితో ఈ రోడ్డు పరిధి గ్రామాల ప్రజలకు అధికారులు తీపి కబురు అందించారు. షికారుగంజి నుంచి జగన్నాథపురం, పి.లింగాలవలస గ్రామాల మీదుగా బాడంగి మండలం వీరసాగరం సరిహద్దు వరకు రోడ్డు పునరుద్ధరణ పనులకు ఏఎంసీ నిధులు రూ.70 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసిందని పీఆర్ డీఈ అప్పలనాయుడు బుధవారం తెలిపారు. రోడ్డు పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు, ప్రభుత్వానికి గ్రామ సర్పంచ్ కొత్తల మంగమ్మ, మాజీ సర్పంచ్ కొత్తల తాడు, సత్యనారాయణ, నాగరాజు, తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

40 మంది పురోహితులకు సత్కారం


పురోహితులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: ఉగాది సందర్భంగా మండలంలోన 40 మంది పురోహితులను స్థానిక వెంకట అమ్మాజీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, వరదా ఈశ్వరరావు బుధవారం ఘనంగా సత్కరించారు. శోభకృత్ నామ సంవత్సరంలో మండల ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పురోహితులు దీవించారు. కార్యక్రమంలోనాయకులు తోట తిరుపతిరావు,ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం,బండారు కామేశ్వరరావు, వాశ్లె భానుచంద్రరావు పాల్గొన్నారు.